# విరిగిన ప్రతిమ

రచన :
శ్రీ కలగర్ల నరసింహామూర్తి.

కమల చెప్పింది విన్నతరువాత రఘు అవాక్కై పోయాడు.

"క్షమించు రఘు. నిన్ను కష్టపెడుతున్నాను. నీ ఆశల్ని సర్వనాశనం చేస్తున్నాను. నాకు తెలుసు. కానీ ఏంచెయ్యను చెప్పు? రాత్రి నాన్నగారి సలహా విన్నతరువాత, మనిద్దరి వివాహం ఏమంత మంచిదికాదని తోస్తోంది. మనిద్దరి అంతస్థుల మధ్య ఎన్నో భేదాలున్నాయ్. నేనా, కలిగిన ఇంట్లో జన్మించిన దాన్ని ఐశ్వర్యం, హోదాల మధ్య పెరిగిన దాన్ని, సుకుమారంగా, సుఖంగా జీవిస్తున్న దాన్ని. ఇంతవరకు పేదరికపు ఛాయలు కూడా నన్ను సోకలేదు. నువ్వా? లేనివాడివి. సాధారణ పేదరికపు జీవితానికి అలవాటు పడ్డవాడివి. అటువంటి నీకు, నాకు ఎలా కుదురుతుంది చెప్పు. ఏదో యవ్వనపు ఆవేశంలో, ఇప్పుడు మనం వివాహం చేసుకున్నా, ఆ తరువాత రానూ, రానూ మనిద్దరి అభిప్రాయాలు, ఆశయాలు, వేరై, మన సంసార జీవితం సర్వనాశనం కాక తప్పదు. నాన్నగారు నా వివాహం ఒక లక్షాధికారితో నిశ్చయం చేసారు. ఇహ నా జీవితం, నందన వనమే. నువ్వుకూడా తగిన యువతిని కట్టుకొని సుఖపడు. నన్ను మరచిపో. 'వస్తా' అంటూ కమల, రఘు సమాధానికైనా, ఎదురు చూడకుండా గబగబ అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయింది.

కమల వెళ్లిపోయిన కొద్ది క్షణాల తరువాత తేరుకున్నాడు రఘు. అతని నయనాలనుండి రెండు అశ్రుకణాలు రాలి, నేలమీద టప్పున పడి ఆ ఇసుకలో ఇంకి పోయాయి.

"ఎంతపని చేసావు కమలా. ఎన్నో ఆశలు జూపి, నా హృదయాన్ని దోచుకొని, నీవు లేనిదే నేను బ్రతుకలేననే స్థితికి నన్ను తీసుకువచ్చి, తుదకు, నా హృదయాన్ని తునా తునకలు జేసావ్. ధన వ్యామోహంతో, ప్రేమ అనే అమృత భాండాన్ని కాలదన్ని వెళ్ళిపోయావ్. విరిగిన హృదయం నేల జారిన, అమృతం, తిరిగి అతుకవు, లభించవు. నీ మనస్సుని, ప్రేమని మోసగించి, ఇంకో వివాహం చేసుకుంటున్నావ్. మంచిది కమలా. కానీ భవిష్యత్తును చెబుతున్నాను. విను ఈ వివాహం నన్నుగానీ, నిన్నుగానీ సుఖపెట్టవు. ఇది నా శాపంకాదు. నీ వివాహంవల్ల జరిగే ఘోర పరిణామం, నేను మాత్రం ఎక్కడున్నా, నీ సుఖాన్నీ కోరుతాను. అంటూ రఘు, విరిగిన హృదయంతో, శోకంతో వెళ్లిపోయాడు.

× × × ×

కమల వివాహం, సుధాకర్ ఫారిన్ రిటర్న్‌డ్‌తో గొప్ప వైభవంగా జరిగిపోయింది. సుధాకర్‌కు లక్ష్మీ, సరస్వతుల కటాక్షం బాగా ఉంది. నాలుగైదు తరాలు, తీరుబాటుగా కూర్చొని తిన్నా, తరగని ఆస్తి, అతని పెద్దలు ఆర్జించి పెట్టారు. ఇలా డబ్బు, చదువు కలసి,

అతనిలో కావలసినంత అహంభావాన్ని, గర్వాన్ని సంపాదించి పెట్టేయ్, నిప్పుకు, వాయువు తోడైనట్లు అతనికి లేని అలవాట్లంటూ లేవు. త్రాగుడు, జూదం, వ్యభిచారం, అన్ని సుగుణాలు అతనికి ఉన్నాయ్. ఐతేనేం డబ్బుంది, చదువుంది. సొసైటీలో పెద్ద పేరుంది. ఆవన్నీ కలసి, అతని మచ్చల్ని కప్పుతున్నాయ్.

శోభనం నాటి తొలిరేయి. కమల అపర రతీదేవిల్లా అలంకరించుకొని, తన భర్త రాక కోసం, గదిలో ఏకాంతంగా ఎదురుచూస్తూ ఉంది. తన భర్త ధనవంతుడు, విద్యావంతుడు. తను అదృష్టవంతురాలు కాబట్టే, అటువంటి భర్త తనకు లభించాడు. అతని సాన్నిధ్యంలో, మత్తైన కౌగిలిలో, తన జీవితం ఇహ కోటిమల్లెల పరిమళాన్ని విరజిమ్ముతుంది. అతని సాహచర్యంతో, తన స్త్రీ జన్మ ధన్యమవుతుంది. ఇలా కమల తీయని బంగారు కలలు కంటూ ఉండగా, ధడాలున తలుపు తెరుచుకున్న శబ్దమయింది. అ వెనువెంటనే గుప్పున ఏదో ఘాటైన వాసన, గదినిండా నిండిపోయింది. సుధాకర్ త్రుళ్లుతూ, తూలుతూ, నోటిలో సిగరెట్టుతో, బుజంమీద వ్రేలాడుతున్న కోటుతో, గదిలోనికి ప్రవేసించాడు. అతని కళ్లు చింత నిప్పుల్లా ఎఱ్ఱగా ఉన్నాయ్. తిన్నగా వచ్చి మంచంమీద కూర్చొని, జేబులో నున్న బ్రాందీ బాటిల్ తీసాడు. కార్క్ ఓపెన్ చేసాడు. ఏదో ఎఱ్ఱని ద్రావం బుస బుసలాడుతూ సీసా పైకివచ్చింది. సీసాలోని బ్రాందీని నోటిలో పోసుకుంటూ 'బాయ్, బాయ్! వేక్ అర్ యూ!' అంటూ అరిచాడు.

కమల కుప్పలా కూలిపోయింది. తన ఆశాహార్మ్యాలు అన్ని తన కంటిముందే కూలిపోయినట్లు కనిపించాయ్. ఇది కలా, నిజమా, అనే భ్రాంతిలో పడిపోయిందామె. కాదు. ఇది కలకాదు. ఇదంతా యదార్థమే. అంటే? తన బ్రతుకు సర్వనాశనమై పోయిందన్న మాట. తన భర్త ఒక త్రాగుబోతు. 'అమ్మో'అంటూ అరచింది కమల.

త్రుళ్ళిపడ్డాడు. సుధాకర్. మూతలు పడుతున్న కనురెప్పల్ని అతికష్టంతో పైకెత్తి 'ఎవరూ?' అంటూ కమల వంకచూసి 'Who are you?' అన్నాడు. కమల కన్నులు తుడుచుకొని, మెల్లగా లేచి నిలబడింది. సుధాకర్ ఆమె వంక ఒక్కక్షణం చూసి, పకపక మని నవ్వి 'సారీ డియర్! ఇది మొదటిరాత్రి కదూ, నువ్వు నా భార్యవు కదూ! అరే, నిలబడిపోయావేం? రా, "Come on" అన్నాడు.

కమల మెల్లగా నడచి, అతని దగ్గరకు వెళ్లి నిలబడింది. ఆమె చెంపలమీద, జారిన కన్నీటిచారలు, ఇంకా కనిపిస్తూనే ఉన్నాయ్. వాటిని సుధాకర్ చూసాడు. అతని లోని రాక్షసుడు విజృంభించాడు.

"Stupid. why tears?" What happend? ఏం జరిగిందని? ఈ ఏడుపు కదిపితే, కన్నీళ్లు రాల్చే, ఆడదంటే నాకు పరమ అసహ్యం. "I hate such dirty dogs" నేను త్రాగుతాను. నాఇష్టం. మధ్య ఏడవడానికి నువ్వెవరవు? "Who are you?" Get out? పో, అవతలికి పో. అంటూ కమలను ఒక్క తోపు తోసాడు. ఆమె తల గోడకు తగిలింది. ఐనా అతడు చలించలేదు. ఆమె బాధతో మూలుగుతోంది.

అతడు హుషారుగా, నిషాలో మంచం మీద పడుకొని "This is a nice morning. Let us have a nice walk my darling" అంటూ ఏదో ఇంగ్లీషు గీతాన్ని పాడుతున్నాడు. అలసిపోయాడేమో! హాయిగా గుఱ్ఱు తీస్తూ ఆనక నిద్ర పోయాడు.

ఎంతో తీయగా, హాయిగా, గడపవలసిన తొలిరేయిని, ఇలా దుఃఖంతో గడపమని విధాత తన నుదుటను వ్రాసాడు. తన తప్పును కమల తెలుసుకుంది. కానీ, కాలుజారి, నరకంలోపడ్డ తరువాత, ఏమనుకుంటే, ఏం లాభం? "భగవాన్, ఇంకా ముందున్నది ముసళ్ల పండుగ. ఈ భయంకర వ్యక్తితో, మానవత్వం లేని ఈ భయంకర త్రాగుబోతుతో, తను జీవితాంతం గడపాలి. అబ్బా! ఎంత భయంకరమైన శాపం! తనకు ఇక విమోచనం లేదా'' తనిలా సర్వనాశనం కావలసిందేనా!

ఆ రాత్రంతా కమలకు కంటిమీద కునుకు లేదు. ఆమె కుమిలి కుమిలి ఏడుస్తూనే ఉంది. ఎప్పుడో భళ్లున తెల్లవారింది.

♦ ♦ ♦

మానవుల కష్టసుఖాలతో కాలానికి నిమిత్తం లేదు. రెండు సంవత్సరాలు గడచిపోయాయి. వసంతం లేని కమల జీవితం ఈ రెండేళ్లలోని గ్రీష్మఋతువు వేడినే చవిచూసింది. ఆ వేడిలో ఆమె ఆశలు అందం, సుఖం అన్నీ భగ్గున మండి బూడిదై పోయాయి. ఈ రెండేళ్లలోను ఆమెను సుధాకర్ హింసించని రోజులేదు. ఆ హింసలతో, దెబ్బలతో ఆమె మరింత మొండిదై పోయింది. జీవచ్ఛవంలా మారిపోయింది కమల. ఆమెలో తొలినాటి అందమూ, సుకుమారము ఇప్పుడు లేదు. 'అమ్మా! నీ జీవితం బండలు చేసానమ్మా. కాలసర్పాన్ని. కంఠాభరణమని భ్రమించి, నీ మెడలో వేసాను. నిన్ను ఆ నీచుడు రాచి, రంపాన పెడుతున్నాడని, విన్నప్పుడల్లా, నా గుండె మండి పోతున్నది తల్లీ. ఐశ్వర్యాన్ని అంతస్థుని చూసి, భ్రమించి, మోసపోయి, నిన్ను ఆ అయోగ్యునికి కట్టబెట్టాను. చేతులారా, నీగొంతుక కోసాను తల్లి. నాకు నిష్కృతిలేదు'' అంటూ కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూ, తండ్రి ఎన్నోసార్లు తనకు ఉత్తరం రాసాడు. తన బిడ్డను సుఖపెట్టమని, ఎన్నోసార్లు బ్రతిమాలుకున్నాడు. తత్ఫలితం ఏమిటి?

సుధాకర్ కఠినమైన నిర్ణయం చేసాడు. ఇది కేవలం, తమ ఆలుమగల స్వంతం విషయం కాబట్టి, మూడోవ్యక్తి ఇందులో తల దూర్చరాదని చెబుతూ, ఇహముందు తన మామగారు, తన ఇంటి గుమ్మం త్రొక్క కూడదని కఠినంగా కట్టడి చేసాడు. ఆ విధంగా కమలకు, తండ్రి దర్శనం కూడా కరువు అయింది.

ఆనాడు మహాశివరాత్రి. కమల తెల్లవారి ఝామునే లేచింది. స్నానం చేసి, గుడికి వెళ్లింది. గుడినుండి తిరిగి వచ్చి, అలా నడుం వాల్చింది. సుధాకర్ ఇంకా మత్తుగా నిద్ర పోతూనే ఉన్నాడు. కమల విచారంగా నిట్టూర్పు విడిచింది. లేచివెళ్లి తన పెట్టె తెరిచింది. పెట్టె అంతా గజిబిజిగా ఉంది. చీరలన్నీ తీసి, సర్దుకుందామని బైటకు తీసింది. ఉపవా

సం వల్ల ఒళ్లంతా నీరసంగా ఉంది కమలకు. అలానే తూలుతూ పెట్టెసర్దుకుంటూ ఉండగా, పెట్టె అడుగున ఉన్న ఉత్తరం కమలకు కనిపించింది. ఆ ఉత్తరాన్ని విప్పిచదివింది. తనకు ఇంకా వివాహం కాని రోజుల్లో, తనను గాఢంగా ప్రేమించిన రఘు రాసిన ఉత్తరం అది. అందులో రఘు కమల అందాన్ని పొగుడుతూ "కమలా నువ్వు నాదానివి కాబోతున్నావ్. అదంతా నా అదృష్టం కమలా! నీ ప్రేమను పొందగలగబోతున్న నా జీవితం ధన్యమయింది. నిన్ను చూడని క్షణం, నాకు నరకంలా ఉంది. నీ అనురాగమంతా మాలగామారి, నీ స్వహస్తాలతో, నా కంఠసీమను అలంకరించే, శుభ ఘడియ కోసం ఎదురు చూస్తున్నాడీ రఘు. మరి ఆ శుభ ఘడియ ఎప్పుడో!"

ఉత్తరం ఆమె చేతులో రెపరెపలాడుతోంది. ఒక్క క్షణకాలం ఆమె వదనంలో మందహాసం మెరిసింది. కానీ వెనువెంటనే ఆ మందహాసం, మాయమై, ఆమె వదనంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయ్. Paradise Lots" (స్వర్గం చేయి జారిపోయింది) అనుకుంది కమల.

ఇంతలో ఏదో బలమైన హస్తం వచ్చి, తన చేతిలోని ఉత్తరం లాక్కుంది. కమల త్రుళ్లిపడి తలెత్తి చూసింది. ఎదురుగా, కండ్లలోనుండి చింత నిప్పులు కురిపిస్తూ, భయంకరంగా నిలబడివున్న భర్తను చూసి, కమల గజగజ వణికిపోయింది. వేటగాని చూసిన చిన్నారి లేడిలా మారిపోయింది కమల.

సుధాకర్ తిన్నగా వెళ్లి, గది తలుపు మూసేసాడు. గోడకు వ్రేళ్లాడుతున్న హంటర్‌ను అందుకున్నాడు. ఛెళ్లున దానితో కమలను కొట్టాడు. 'అమ్మో' అంటూ కమల బిగ్గరగా అరిచింది.

'రాస్కెల్, రంకులాడీ! నా కళ్లుగప్పి నాటకాలాడుతున్నావా? ఇలా ఎన్ని దొంగ నాటకాలు నడిపించావ్? నువ్వు కుక్క ముట్టిన కుండవన్నమాట. అందుకే నీ బాబు, నిన్ను నాకు అంటగట్టాడు. కదూ! చావు!' అంటూ సుధాకర్, కమలను ఛెళ్లుఛెళ్లున్న హంటర్‌తో కొట్టడం ప్రారంభించాడు.

'నేను నిరపరాధిని. నేనేం తప్పుచెయ్యలేదు. అది కేవలం ఉత్తరం. నా శీలం చెడలేదు. నన్ను నమ్మండి' అంటూ కమల ఏడుస్తూ, సుధాకర్ కాళ్ళకు పెనవేసుకుపోయింది. కానీ సుధాకర్ హృదయం కరగలేదు. అతనిలోని దానవత్వం పూర్తిగా విజృంభించింది. అతడు ఆమెను అలా హంటర్‌తో గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు.

'అమ్మో! వద్దు. మరి నన్ను కొట్టకండి. నేనీ భాదను భరించలేను. నేను నిర్దోషిని' అంటూ కమల రోదిస్తూనే ఉంది. ఆమె శరీరమంతా చారలతో నిండిపోయింది. ఒంటినిండా రక్తం కారుతూ ఉంది.

అకస్మాత్తుగా ఆమె రోదన ఆగిపోయింది. ఐనా ఆమెను కొట్టడం మానలేదు సుధాకర్. అలా కొట్టి కొట్టి సుధాకర్ అలసిపోయాడు.

'అరే, ఇన్ని కొట్టినా రాస్కెల్, ఊలేదు ఛూలేదు. దీని శరీరం, రాయా ఉక్కా అనుకుంటూ సుధాకర్. కమలను తాకి చూసాడు. ఆమె శరీరం మంచుముక్కకంటే చల్లగా ఉంది. నాడి ఆగిపోయింది.

దగ్గరలో నున్న శివాలయంలో మరింత గట్టిగా గంటలు మ్రోగుతున్నాయ్. 'హర హర మహాదేవ్, శంభో శంకర' అంటూ భక్తులు పరమేశ్వరుని ప్రార్థిస్తున్నారు. లోక కళ్యాణంకోరకు, సర్వేశ్వరుడు హాలాహలాన్ని మ్రింగిన ఆ మహోత్తర పుణ్యదినాన్న, కమల శాశ్వతంగా కన్ను మూసింది.

సుధాకర్ తృప్తిపడ్డాడు. ఆమె మరణించిందని తెలియగానే అతనిలోని దానవుడు పూర్తిగా చచ్చిపోయాడు. 'నామూలంగా కమల ఏనాడూ సుఖించలేదు. ఆమెను సర్వనాశనం చేసాను, తుదకు చేతులారా ఆమెను హత్యచేసాను. ఇహ నేను ఉంటేనేం, చస్తేనేం' అనుకుంటూ సుధాకర్ తిన్నగా పోలీస్ స్టేషనుకు వెళ్లి, స్వయంగా తన నేరాన్ని చెప్పుకున్నాడు. అతన్ని పోలీసులు అరెస్టుచేసారు.

కమల, మరణ వార్తను విన్న ఆమె తండ్రి, గుండె ఆగి, వెంటనే మరణించాడు.

\+ \+ \+

కథను పూర్తిచేసి, ఆ సన్యాసి, తన శిష్యుల వంక చూసాడు. అందరి కళ్ళు కన్నీళ్ళతో నిండివున్నాయ్. సన్యాసి తిరిగి చెప్ప నారంభించాడు.

'కమల అందమైన ప్రతిమ. ఆమెను తన హృదయ మందిరంలోనే, ప్రతిష్టించుకుందామని ఆశించాడు రఘు. కానీ ఆ ప్రతిమ, అప్రయోజకుని చేతిలోబడి, ముక్కముక్కలయింది. భగవంతుని నిర్ణయం విచిత్రమైనది. ఆ విచిత్ర నిర్ణయానికి మానవుడు తల ఒగ్గక తప్పదు. ఫలితాన్ని అనుభవించక తప్పదు' అంటూ సన్యాసి శిష్యుల వంక చూసాడు. అతని కన్నుల్లో, కన్నీళ్ళు స్పష్టంగా మెరుస్తున్నాయ్.


# THE VYSYA BANK LIMITED

Established : 1930 Scheduled Bank

*Regd Office ;*

**AVENUE ROAD BANGALORE CITY**

*Chairman :*

SRI YADALAM S. GOPALAKRISHNA SETTY

## THE BANK FOR BIG AND SMALL

***offers attractive Schemes for profitable Savings at higher rates of interest***

| FIXED DEPOSITS | CUMULATIVE DEPOSITS | SPECIAL SAVINGS DEPOSITS |
|---|---|---|
| interest upto 7.75% P. A. | interest upto 7.81% P. A. | interest at 5 % P.A. on daily balances |

our PRAGATHI DEPOSIT SCHEME helps your money grow fast
Instalments collected at your Doors.

*Further particulars Can be had from any of our offices*

J. SURYANARAYANA CHETTY—General Manager.